MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

# మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 6 | సంచిక : 170 | శనివారం 24 అక్టోబర్ 2026 | పేజీలు : 4 | వెల : 3/-

### అల్లూరి సీతారామరాజు జిల్లాలో

# ఘోర ప్రమాదం

## -- పేలుడికి ఏడుగురి మృతి







**(అంకుశం, అమరావతి, అక్టోబర్ 24):**

అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పినకోట సమీపంలో శనివారం జరిగిన ఘోర ప్రమాదంలో ఏడుగురు మృతి చెందారు. ప్రమాదంలో డ్రైవర్, ఐదుగురు కార్మికులు, రోడ్డుపై వెళ్తున్న ఒక టీచర్ కూడా ప్రాణాలు కోల్పోయారు. పినకోట పంచాయతీ పరిధిలోని ఘాట్ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా రాళ్లు పగలగొట్టడానికి బ్లాస్టింగ్ పనులు జరుగుతున్నాయి. అక్కడ జిలెటిన్ స్టిక్స్ ఉన్న వాహనానికి డీజిల్ నింపుతుండగా మంటలు చెలరేగి పేలుడు సంభవించింది. పేలుడు తీవ్రత ఎక్కువగా ఉండటంతో శవాలు ముక్కలయ్యాయి. ఇప్పటి వరకు పోలీసులు గుర్తించిన వివరాల మేరకు పాఠశాలకు వెళ్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయురాలు సునీత (విశాఖపట్నం). డ్రైవర్ పవన్ కుమార్ (కడప), కార్మికులు మణి (దేవరాపల్లి), నారాయణ రావు (చీడకాడ)గా గుర్తించారు. మరో ముగ్గురి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు వెల్లడించారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా హోం మంత్రి వంగలపూడి అనిత అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్, ఎస్పీలతో మాట్లాడి గాయపడినవారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని మృతుల కుటుంబాలకు సహాయం అందించాలని ఆదేశించారు.

# ప్రచారానికి సమాయత్తం

## ఎంపీటీసీలకు 51,902, జడ్పీటీసీలకు 5,724 మంది నామినేషన్లు

**(అంకుశం, అమరావతి, అక్టోబర్ 24):**

ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు నామినేషన్లు దాఖలు చేసే గడువు ముగిసింది. 28 జిల్లాల్లో మొత్తం 9,829 ఎంపీటీసీలు, 659 జడ్పీటీసీలకు ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలకు సంబంధించి ఇప్పటి వరకు ఎంపీటీసీలకు 51,902, జడ్పీటీసీలకు 5,724 నామినేషన్లు దాఖలయ్యాయి. ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి పార్టీల వారీగా చూస్తే టీడీపీ, వైఎస్సార్‌సీపీ అగ్రస్థానంలో ఉండగా జనసేన పార్టీ మూడో స్థానంలో నిలిచింది. టీడీపీ తరపున 22,013 మంది, వైఎస్సార్‌సీపీ నుండి 20,556, జనసేన తరపున 4,609 మంది నామినేషన్లు దాఖలు చేశారు. అదేవిధంగా బీజేపీ 1,150, కాంగ్రెస్ 463, సీపీఐ(ఎం) 434, బీఎస్పీ 173, ఆప్ నుంచి ముగ్గురు, ఇతర పార్టీలకు చెందిన వారు 200, స్వతంత్రులు 2,301 మంది నామినేషన్లు దాఖలు చేశారు. జడ్పీటీసీ స్థానాలకు టీడీపీ నుంచి 2,078, వైఎస్సార్‌సీపీ 1,815, జనసేన 679, కాంగ్రెస్ 315, బీజేపీ నుంచి 255 మంది నామినేషన్లు దాఖలు చేశారు. అంతేకాకుండా బీఎస్పీ నుంచి 121, సీపీఐ(ఎం) 74, ఆప్ 13, ఇతర పార్టీలకు చెందిన వారు 111, స్వతంత్రులుగా 263 మంది నామినేషన్లు వేశారు. తిరుపతి, శ్రీకాకుళం జిల్లాల్లో ఎంపీటీసీలకు అధిక నామినేషన్లు - మిగతా 2లో

# జగన్ కంసమామయ్య

## -- మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు

**(అంకుశం, అమరావతి, అక్టోబర్ 24):**



మేనకోడలి పెళ్లి ఆపి జగన్ మోహన్‌రెడ్డి కంసమామయ్యగా తయారయ్యారని సీఎం చంద్రబాబు విమర్శించారు. ఉండవల్లిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. షర్మిల కుమార్తె అంజలి పెళ్లికి ఆహ్వాన పత్రికలు పంచాక పెళ్లికి అడ్డుపడ్డాడు. సొంత చెల్లి పట్ల జగన్ అనుసరిస్తున్న తీరును ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. షర్మిల కుమార్తె అంజలి వివాహాన్ని బెంగళూరులోని యలహంక ప్యాలెస్‌లో నిర్వహించాలన్న ప్రతిపాదనకు జగన్ అభ్యంతరం చెప్పినట్లు వచ్చిన వార్తలపై సీఎరస్పందించారు. జగన్‌ను మేనమామగా కాకుండా 'కంసమామ'గా అభివర్ణిస్తూ విమర్శలు గుప్పించారు. పురాణాల్లో కంసుడు తన మేనల్లుడైన శ్రీకృష్ణుడికి హాని చేయడానికి ప్రయత్నించిన వ్యక్తిగా ప్రసిద్ధి. ఆ పోలికను ప్రస్తావిస్తూ జగన్ ఆలోచనా విధానంపై చంద్రబాబు విమర్శలు చేశారు.

**జగన్ అరాచకాలపై పెద్ద ఎత్తున చర్చ జరగాలి..**

స్థానిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకులు చేస్తున్న అరాచకాలపై పెద్ద ఎత్తున చర్చ జరగాలని చంద్రబాబు పేర్కొన్నారు. పుంగనూరు, రాయచోటి, కనిగిరి, దర్శి, కడప, తంబళ్లపల్లె, తిరుపతి ప్రాంతాల్లో ఆ పార్టీ నేతలు హింసకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా 'అదే హింస.. అవే అబద్ధాలు.. అవే అరాచకాలు' అనే బుక్‌లెట్‌ను విడుదల చేశారు. జగన్ ముఖ్యమంత్రిగా, రాజకీయ నాయకుడిగా, కుమారుడిగా, సోదరుడిగా, పౌరుడిగా తన బాధ్యతలను సక్రమంగా నిర్వహించలేకపోయారని చంద్రబాబు విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం వివాదాలను సృష్టించడం, తప్పుడు ప్రచారంతో రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీయడం వంటి చర్యలకు వైఎస్సార్‌సీపీ పాల్పడుతోందని చంద్రబాబు విమర్శించారు. రాజకీయ హింస, అశాంతి రాష్ట్ర అభివృద్ధికి, పెట్టుబడుల ఆకర్షణకు ఆటంకంగా మారతాయని చంద్రబాబు పేర్కొన్నారు.

# మేనకోడలి పెళ్లి వేదిక మార్చుకోండి!

## బెంగుళూరు వద్దు.. ప్రత్యామ్నాయంగా హైదరాబాద్ సూచన

## కుటుంబ భద్రతపై ఆందోళన.. సోదరి షర్మిలకు వైఎస్ జగన్ లేఖ




**(అంకుశం, అమరావతి, అక్టోబర్ 24):**

మేనకోడలు అంజలి వివాహం పట్ల తనకున్న ప్రేమను, ఆమె భవిష్యత్తుపై ఉన్న ఆకాంక్షలను వ్యక్తం చేస్తూనే, కుటుంబ భద్రత, గోప్యతకు సంబంధించిన ఆందోళనలను వివరిస్తూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి షర్మిలకు లేఖ రాశారు. అంజలి జీవితాంతం సంతోషంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని పేర్కొంటూనే, బెంగళూరులోని తన నివాసంలో వివాహం నిర్వహించడం వల్ల తలెత్తే భద్రతాపరమైన సమస్యలను అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

- మిగతా 2లో

# వైసీపీలోకి జనసేన సాయికృష్ణ యాదవ్

## జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

## ప్రజల వద్దకు పాలనను తీసుకెళ్లిన ఘనత వైసీపీదే : మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్





**అంకుశం న్యూస్‌అనంతపురం, అక్టోబర్ 24 :**

అనంతపురం నగరపాలక సంస్థ ఎన్నికల ప్రచారం వేడెక్కుతున్న వేళ అనంతపురం నగరంలోని ఒకటో డివిజన్‌కు చెందిన జనసేన సాయికృష్ణ యాదవ్ తన మిత్రబృందంతో కలిసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్ ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నేత అనంత చంద్రారెడ్డి, నగర అధ్యక్షులు చింతా సోమశేఖరరెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షులు సాకే చంద్ర, నాయకులు అమర్‌నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ 1వ డివిజన్‌కు చెందిన జనసేన నాయకులు సాయికృష్ణ ఆ పార్టీ కోసం క్రియాశీలకంగా పని చేశారని, అలాంటి వ్యక్తి వైసీపీలోకి రావడం సంతోషించదగ్గ విషయమన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జరుగుతున్న పరిణామాలు ప్రజలందరూ గుర్తించుకోవాలన్నారు. నామినేషన్ దాఖలు చేసిన వైసీపీ శ్రేణులపై కూటమి నేతలు దాడి చేయడం సిగ్గు చేటన్నారు. ఎన్నికల ప్రచారంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఈ నగరంలో జరుగుతున్న అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు అనుసరిస్తున్న ధోరణి, వారి అరాచకాలు, పేదల ఆస్తులను ఎలా కాజేయాలని - మిగతా 2లో

# ఓటు తొలగించారని ఒక్కరూ ఫిర్యాదు చేయలేదు

- ఆధారాలు ఉంటే చూపండి: రేవంత్‌కు బీజేపీ సవాల్
- ఓట్ల తొలగింపు పేదలకు వ్యతిరేకంగా బీజేపీ పన్నిన కుట్ర అని సీఎం ఆరోపణ
- ఆరోపణలకు ఆధారాలు చూపాలని రేవంత్ రెడ్డికి బీజేపీ సవాల్
- 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' పేరుతో పాదయాత్రలకు సిద్ధమైన బీజేపీ
- నవంబర్ 1 నుంచి హైదరాబాద్, సిద్దిపేట, కరీంనగర్‌లో బీజేపీ యాత్రలు

# అభ్యర్థులందరూ ప్రచారంలో ముందంజలో ఉండటం అభినందనీయం-మాజీ ఎమ్మెల్యే సత్తి

**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ అక్టోబర్ 24:** గత ప్రభుత్వంలో అమలైన సంక్షేమ పథకాలను, ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనను బేరీజు వేసుకుని ఓటర్లు సరైన నిర్ణయం తీసుకోవాలని అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి  కోరారు. ఈ మేరకు శనివారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ స్థానిక సంస్థలకు జరగనున్న ఎన్నికల నేపథ్యంలో అనేక ఒత్తిళ్లు వచ్చినప్పటికీ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా పోటీ చేసేందుకు ధైర్యంగా ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. అభ్యర్థులందరూ ప్రచారంలో ముందంజలో ఉండటం అభినందనీయమని కొనియాడారు.
ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లినప్పుడు అభ్యర్థులు ఓటర్లకు గత ప్రభుత్వానికి, ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి




మధ్య ఉన్న వ్యత్యాసాన్ని స్పష్టంగా వివరించాలని ఆయన సూచించారు. వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి  హయాంలో అమలైన సంక్షేమ పథకాలను ప్రస్తుత ప్రభుత్వం పక్కన పెట్టేసిందని విమర్శించారు. ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు.
దేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా అతి తక్కువ సమయంలోనే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకాయని ఆందోళన వ్యక్తం చేశారు. బియ్యం, పంచదార, నూనె, పప్పు ధాన్యాలు మొదలుకొని ఏదైనా షాప్‌కి వెళ్లి ధర అడిగితే షాక్ కొట్టే పరిస్థితి దాపురించిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న దౌర్జన్యాలు, దాడులను కూడా ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని అభ్యర్థులను కోరారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్న ఆయన, గడపగడపకూ వెళ్లి ప్రభావవంతంగా క్యాన్వాసింగ్ నిర్వహించాలని కోరారు.

## సివిల్స్ కోచింగ్ విద్యార్థులకు అండగా తెలంగాణ ప్రభుత్వం..

సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సిద్ధమవుతున్న బీసీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. హైదరాబాద్‌లోని సైదాబాద్ బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందుతున్న 100 మంది అభ్యర్థులకు అందించే ఆర్థిక సాయాన్ని గణనీయంగా పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. పెంచిన మొత్తాలను వచ్చే నెల నుంచే అమలు చేయనున్నట్లు ప్రకటించింది. వివరాల్లోకి వెళితే, సివిల్స్ కోచింగ్ తీసుకుంటున్న విద్యార్థులకు ఇప్పటివరకు నెలకు రూ.5,000గా ఉన్న స్టైఫండ్‌ను రూ.7,000కు పెంచారు. అదేవిధంగా, పుస్తకాల కొనుగోలు కోసం ఒకేసారి ఇచ్చే బుక్ ఫండ్‌ను రూ.5,000 నుంచి ఏకంగా రూ.10,000కు రెట్టింపు చేశారు. ఈ పెంచిన మొత్తాలను విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తెలిపారు. ప్రభుత్వం నియమించిన నిపుణుల కమిటీ సిఫార్సుల మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు. ప్రస్తుతం సైదాబాద్ కేంద్రంలో 100 మంది విద్యార్థులకు మూడేళ్ల సమగ్ర సివిల్స్ శిక్షణ అందిస్తున్నామని, మరో 100 మందికి ఇతర పోటీ పరీక్షల కోసం ఫౌండేషన్ కోర్సులలో శిక్షణ ఇస్తున్నామని హరికృష్ణ పేర్కొన్నారు. అభ్యర్థులు ప్రైవేట్ స్టడీ హాళ్ల కోసం డబ్బు వృథా చేయకుండా, స్టడీ సర్కిల్ లైబ్రరీ వేళలను కూడా పొడిగించినట్లు తెలిపారు. ఇకపై లైబ్రరీ ఉదయం 7 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## హైదరాబాద్‌కు నీటి గండం

హైదరాబాద్ నగరాన్ని తీవ్ర నీటి సంక్షోభం ఆందోళనకు గురిచేస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షపాతం తగ్గడం, రిజర్వాయర్లలో నీటిమట్టాలు గణనీయంగా పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. తాగునీటి సరఫరాపై ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుండటంతో, నీటిని పొదుపుగా వాడుకోవాలని నగరంలోని రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు పౌరులకు విజ్ఞప్తి చేస్తున్నాయి. మణికొండలోని పంచవటి సాయి లక్ష్మి కాలనీలో ఒక వ్యక్తి సైకిల్‌పై లౌడ్‌స్పీకర్‌తో అవగాహన కల్పిస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. కార్లు, సెల్లార్లు, రోడ్లు, టెర్రస్‌లు శుభ్రం చేసేందుకు కుళాయి లేదా బోర్ నీటిని వృథా చేయవద్దని ఆయన నినదిస్తున్న తీరు, నగరంలో నెలకొన్న నీటి ఎద్దడి తీవ్రతను కళ్లకు కడుతోంది. రాష్ట్రంలో నెలకొన్న ఈ క్లిష్ట పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా అంగీకరించింది. ఈ ఏడాది సాధారణం కంటే 27 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, ఫలితంగా రాష్ట్రంలోని 621 మండలాలకు గాను 324 మండలాల్లో భూగర్భ జలాలు అట్టడుగుకు పడిపోయాయని నివేదికలు వెల్లడిస్తున్నాయి. కొన్ని రిజర్వాయర్లలో నీటి నిల్వలు 20 శాతం కంటే తక్కువకు చేరుకున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా తెలిపారు. ప్రస్తుత తరుణంలో సాగునీటి కంటే ప్రజలు, పశువులు, ఇతర జీవరాశుల తాగునీటి అవసరాలకే ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలోని జలాశయాల్లో 30 నుంచి 40 శాతం మేర నీటి నిల్వలు ఉన్నాయని, 2027 జూలై వరకు తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడటమే తమ ప్రథమ కర్తవ్యమని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మార్పులు, నీటి పొదుపు ఆవశ్యకతపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. నీటి సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించేందుకు త్వరలోనే ఒక ప్రత్యేక టోల్-ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

## పీసుమామిడి పేలుడు ఘటనపై జగన్ దిగ్భ్రాంతి..

-మొదటిపేజీ తరువాయి
పగలగొట్టేందుకు బొలెరో వాహనంలో జిలెటిన్ స్టిక్స్ ఉంచారు. సమీపంలో ఉన్న టిప్పర్‌కు డీజిల్ నింపుతుండగా ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. ఈ మంటలు వేగంగా వ్యాపించి జిలెటిన్ స్టిక్స్ ఉన్న వాహనానికి అంటుకోవడంతో భారీ పేలుడు సంభవించింది. ఈ దుర్ఘటనలో విశాఖపట్నం నుంచి మద్దిరేబు ఎంపీపీ పాఠశాలకు వెళుతున్న ఉపాధ్యాయురాలు సునీతతో పాటు కార్మికులు మణి, నారాయణరావు, పవన్ కుమార్ మరికొందరు ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటనపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "ఈ ఘటనలో మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. ఈ దుర్ఘటనలో కార్మికులతో పాటు ప్రభుత్వ టీచర్ సునీత కూడా మృతి చెందడం అత్యంత బాధాకరం. ఉపాధి కోసం వచ్చిన కార్మికులు, విధి నిర్వహణలో ఉన్న ఉపాధ్యాయురాలు ఇలా ఆకస్మికంగా ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. ప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపించాలి. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తగిన ఆర్థిక పరిహారం అందించాలి" అని డిమాండ్ చేశారు. ప్రమాదంపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత కూడా స్పందించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలకు అండగా నిలవాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మేనకోడలి పెళ్లి వేదిక మార్చుకోండి!

-మొదటిపేజీ తరువాయి
ఈ లేఖను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మీడియాకు విడుదల చేసింది. గత ఏడేళ్లలో ఎన్ని పరిణామాలు చోటుచేసుకున్నా అంజలి సంతోషంగా ఉండాలని, ఆమె వివాహం జీవితాంతం మధురమైన జ్ఞాపకంగా మిగలాలని వైయస్ జగన్ తన లేఖలో ఆకాంక్షించారు. అంజలి పట్ల తనకు ఎంతో ప్రేమ ఉందని, ఆమెకు మంచి జరగాలన్నదే తన కోరిక అని వివరించారు. అయితే, తాను ప్రస్తుతం నివసిస్తున్న బెంగళూరు ఇంట్లో వివాహం నిర్వహిస్తే అతిథులు, క్యాటరింగ్ సిబ్బంది, అలంకరణ బందాలు, ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు సహా పెద్ద సంఖ్యలో వ్యక్తులు రాకపోకలు సాగిస్తారని పేర్కొన్నారు. ఇంటి ప్రాంగణం, పరిసర ప్రాంతాల ఫొటోలు, వీడియోలు బయటకు వెళ్లడం వల్ల తనతో పాటు కుటుంబ సభ్యుల భద్రత, గోప్యతకు సమస్యలు తలెత్తవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. తన అభ్యంతరాలను ఇప్పటికే పలువురి ద్వారా తెలియజేసినప్పటికీ, బెంగళూరు నివాసంలోనే వివాహం నిర్వహించాలనే నిర్ణయం కొనసాగడం తనకు బాధ కలిగించిందని జగన్ లేఖలో పేర్కొన్నారు. ఈ నిర్ణయం తీసుకోవడం తనకు సులభం కాదని, అంజలి పట్ల ప్రేమాభిమానాలు ఉన్నప్పటికీ కుటుంబ భద్రతను నిర్లక్ష్యం చేయలేనని వివరించారు. కన్వెన్షన్ సెంటర్ లేదా ప్రత్యేక వివాహ వేదికను ఎంచుకోవడం ఇష్టం లేకపోతే, హైదరాబాద్‌లోని తన లోటస్ పాండ్ నివాసంలో వివాహం నిర్వహించుకోవచ్చని ప్రత్యామ్నాయాన్ని సూచించారు. అంజలి వివాహం ఆనందంగా, ప్రత్యేకంగా జరగాలని తాను కోరుకుంటున్నానని, అందుకు తనవంతు సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని జగన్ తెలిపారు. అదే సమయంలో తన పరిస్థితిని, భద్రతపై ఉన్న ఆందోళనలను కూడా అర్థం చేసుకోవాలని షర్మిలకు విజ్ఞప్తి చేశారు. అంజలి భవిష్యత్తుపై  శుభాకాంక్షలు తెలుపుతూనే, కుటుంబ భద్రతకు సంబంధించిన అంశాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

## ప్రచారానికి సమాయత్తం

-మొదటిపేజీ తరువాయి
దాఖలయ్యాయి. తిరుపతి జిల్లాలో 2,949, శ్రీకాకుళంలో 2,949 నామినేషన్లు వచ్చాయి. ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాలో 2,639, అనంతపురంలో 2,450 నామినేషన్లు నమోదయ్యాయి.

## వైసీపీలోకి జనసేన సాయికృష్ణ యాదవ్

-మొదటిపేజీ తరువాయి
కుట్రపన్నుతున్నారన్నారు. ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేది వైఎస్సార్‌సీపీనే అన్నారు. గత వైసీపీ హయాంలో జరిగిన అనంత అభివృద్ధిని.. ప్రస్తుతం రెండున్నరేళ్ల కూటమి ప్రభుత్వంలో నగరాన్ని కుంటుపరిచారన్నారు. ఈ నగరంలో శాంతిభద్రతలు లోపించాయని, అభివృద్ధి జరగాలన్నా.. ప్రశాంతత వాతావరణం ఉండాలన్నా వైసీపీతోనే సాధ్యమన్నారు. జనసేన నుంచి వచ్చిన సాయికష్ణతోపాటు ఆయన మిత్రబృందం వైసీపీ కుటుంబంలో చేరడం సంతోషించదగ్గ విషయమన్నారు.
మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళు గడిచినా ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని రమేష్ గౌడ్ ఆరోపించారు. కొత్త పింఛన్లు మంజూరు చేయలేదని, పేదల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రజల వద్దకు పాలనను తీసుకెళ్లిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. నగరంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, రోడ్లు, పారిశుద్ధ్య పనులు సక్రమంగా సాగడం లేదని రమేష్ గౌడ్ విమర్శించారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో నగరాభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగలేదన్నారు. నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి వైసీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గతంలో అనంత వెంకటరామిరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నగరం ఎంతో అభివృద్ధి చెందిందని ఆయన పేర్కొన్నారు. కరోనా సమయంలో, వరదలు సంభవించినప్పుడు ప్రజలకు అండగా నిలిచి సేవలందించిన నాయకత్వం వైసీపీదేనన్నారు. కులమతాలకతీతంగా ఐక్యమత్యంతో ఉండే ప్రస్తుత ఎన్నికల సమయంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని రమేష్ గౌడ్ సూచించారు. నగర ప్రజల ఆస్తులకు రక్షణ, అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఓటు వేయాలని కోరారు. అనంతపురం నగర ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలంటే నగరపాలక సంస్థలోని 62 డివిజన్లలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు అనే ఆయుధంతో కూటమి అభ్యర్థులకు తగిన సమాధానం చెప్పాలని ప్రజలను కోరారు.
వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ మాట్లాడుతూ.. సాయికృష్ణ యాదవ్ మిత్ర బృందం జనసేన నుంచి వైసీపీలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. పవన్‌కళ్యాణ్‌ను నమ్మి యువత పెద్ద ఎత్తున మోసపోయారని తెలిపారు. వైసీపీ హయాంలో సచివాలయ ఉద్యోగాలు కల్పించి వాలంటీర్లను నియమించి ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించామని తెలిపారు. గత ఎన్నికల సమయంలో వాలంటీర్లకు ప్రతి నెలా రూ.10 వేలు ఇస్తామని చెప్పి చివరకు ఆ వ్యవస్థే లేకుండా చేశారన్నారు. అనంతపురం నగరంలో ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎలా ఉంది? ఈ రెండున్నరేళ్ల కూటమి పాలనలో ఎలా ఉందో ప్రజలు ఆలోచించాలని కోరారు. కూటమి ప్రభుత్వం వచ్చాక అనంతపురంలో కబ్జాలు పెరిగిపోయాయని, ప్రజల ఆస్తులకు భరోసా లేకుండాపోయిందన్నారు. అధికార పార్టీ నేతలే రేషన్ దందా చేస్తున్నారని అన్నారు. వైసీపీ మేయర్ అభ్యర్థి రమేష్‌గౌడ్‌తో పాటు 1వ డివిజన్ అభ్యర్థి షెక్షా, 4వ డివిజన్ అభ్యర్థి ప్రణతిలను గెలిపించాలని కోరారు.

**వైసీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యం : సాయికృష్ణ యాదవ్**

జనసేన నుంచి వైసీపీలోకి చేరిన సాయికృష్ణ యాదవ్ మాట్లాడుతూ.. 1, 4వ డివిజన్‌ల వైసీపీ అభ్యర్థులు షెక్షావలి, ప్రణతితోపాటు మేయర్ అభ్యర్థి రమేష్ గౌడ్ గెలుపే లక్ష్యంగా తనవంతు కృషి చేస్తానన్నారు. వైసీపీ సిద్ధాంతాలు నచ్చి జనసేన వీడినట్లు చెప్పారు. వైసీపీ బలోపేతం కోసం శాయశక్తులా పని చేస్తానని తెలిపారు.

## ఓటు తొలగించారని ఒక్కరూ ఫిర్యాదు చేయలేదు..



తెలంగాణలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ఆరోపణలను బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్రంగా ఖండించారు. తమ ఓటును తొలగించారని రాష్ట్రంలో ఇప్పటివరకు ఒక్క ఓటరు కూడా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయలేదని, కానీ కాంగ్రెస్ నేతలు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో పేదలు, ఆదివాసీలు, దళితులు, మైనారిటీలు, మహిళల ఓట్లను తొలగించి ఎన్నికల్లో గెలవాలని బీజేపీ కుట్ర పన్నుతోందని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించిన విషయం తెలిసిందే. ప్రధాని నరేంద్ర మోదీ దేశంలో ఓటు హక్కు ఉన్నవారు, లేనివారు అంటూ రెండు రకాల పౌరులను సృష్టిస్తున్నారని, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రలోనూ బీజేపీ ఇదే పద్ధతిని అనుసరించిందని ఆయన విమర్శించారు. ఈ ఆరోపణలపై శుక్రవారం రాంచందర్ రావు స్పందిస్తూ, "ఇప్పటివరకు ఒక్క ఓటరు కూడా తన ఓటు పోయిందని చెప్పలేదు. కానీ రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి మాత్రమే వీధుల్లోకి వచ్చి ఓట్లు తొలగించారని అరుస్తున్నారు" అని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి, ఆయన మంత్రులు తమ ఆరోపణలకు ఆధారాలు చూపించాలని సవాల్ విసిరారు. ఓట్ల తొలగింపు అంశంపై నవంబర్ 1న ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ తలపెట్టిన నిరసనలో ఆ పార్టీ నేతలు పాల్గొంటుండడాన్ని కూడా రాంచందర్ రావు తప్పుబట్టారు. దీనికి ప్రతిగా, 'ప్రజాస్వామ్యాన్ని కాపాడండి - అరాచకానికి వ్యతిరేకంగా పోరాడండి' అనే నినాదంతో బీజేపీ పాదయాత్రలు నిర్వహిస్తుందని ప్రకటించారు. నవంబర్ 1న హైదరాబాద్‌లో ఈ యాత్ర ప్రారంభమై, ఆ తర్వాత సిద్దిపేట, కరీంనగర్‌లో కొనసాగుతుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో అధికార కాంగ్రెస్, బీజేపీ మధ్య ఓటర్ల జాబితా సవరణ అంశం తీవ్ర రాజకీయ వివాదానికి దారితీసింది. భారీ ఎత్తున ఓట్లు తొలగించారని కాంగ్రెస్ ఆరోపిస్తుండగా, ఇది కేవలం నకిలీ, డూప్లికేట్, మరణించిన ఓటర్లను గుర్తించి తొలగించేందుకు ఎన్నికల సంఘం చేపట్టే సాధారణ ప్రక్రియేనని బీజేపీ వాదిస్తోంది.

## వై సి పి చైర్మన్ కాచర్ల ఆంజనేయులు గెలుపు కోసం మాజీ వైస్ చైర్మన్ ల ప్రచారం!

**అంకుశం న్యూస్ ధర్మవరం అక్టోబర్ 24**
ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి ఆదేశాల మేరకు ధర్మవరం లో వై సీపీ తరుపున మున్సిపల్ చైర్మన్ గా పోటీ చేస్తున్న కాచర్ల ఆంజనేయులు విజయం కోసం ధర్మవరం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లు వేముల జయరాం రెడ్డి చందమూరి నారాయణ రెడ్డి మాసపల్లి సాయి కుమార్ లు ఇంటింటా ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయండి అంటూ ప్రచారం చేశారు. వైసిపీ అధినేత వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి స్ఫూర్తి పార్టీ కి కార్యకర్తలకు ఎంతో ఉత్సాహం నింపాయని ఈ ఎన్నికల్లో చేనేత రంగానికి చెందిన మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి కాచర్ల ఆంజనేయులు ని గెలిపించాలని వారు కోరారు.



## వారణాసిలో ఆకట్టుకున్న ఆంధ్రా విద్యార్థులు కళా ప్రదర్శన



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ అక్టోబర్ 24:** వారణాసిలో ఈ నెల 14 నా ప్రారంభమైన గంగా గోదావరి సాంస్కృతిక సంగమంలో బాగంగా అనపర్తి మరియు రామచంద్రపురం విద్యార్థులు కర్రీ తన్విష రెడ్డి,జప్త్ర భాషిత,ఆర్యాహిలు  కూచిపూడి నృత్య ప్రదర్శనతో అలరించారు. రామచంద్రపురంలో శ్రీ లలిత కూచిపూడి నాట్యాలయ నిర్వాహకురాలు వద్దినిడి లలిత నాయుడు సోమవారం కార్యక్రమ వివరాలు వివరించారు. మోక్ష సదన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బెనారస్ హిందూ విశ్వ విద్యాలయంలో కళా ప్రదర్శన ఏర్పాటు చేశారు అని చెప్పారు అనపర్తి రామచంద్రపురం కళాకారులతో వెళ్లి ప్రదర్శనలు ఇచ్చారని అన్నారు చిన్నారుల ప్రతిభ తో ప్రశంసాపత్రాలు అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

## ఎంపీటీసీ నామినేషన్ల పరిశీలన..

**-ఆమోదం పొందిన అభ్యర్థుల తుది జాబితా విడుదల**

**-ఈనెల 27న ఉపసంహరణకు గడువు**



**రాప్తాడు అంకుశం న్యూస్ అక్టోబర్ 24**  మండల పరిధిలోని స్థానిక సంస్థల ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి శనివారం నామినేషన్ల పరిశీలన (స్క్రూటినీ) ప్రక్రియ రాప్తాడు ఎంపీడీవో కార్యాలయంలో ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల నిబంధనల ప్రకారం రిటర్నింగ్ అధికారులు నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి ఆమోదం పొందిన అభ్యర్థుల తుది జాబితాను అధికారికంగా విడుదల చేశారు. బొమ్మేపర్తి ఎంపీటీసీ స్థానానికి టీడీపీ తరఫున కే. మల్లేశ్వరమ్మ, బెంచి సుభద్ర నామినేషన్లు ఆమోదం పొందగా వైసిపి అభ్యర్థి నామినేషన్ ను తిరస్కరించారు. గొందిరెడ్డిపల్లి స్థానంలో టీడీపీ నుండి పసుపుల రుక్మిణి, పసుపుల లక్ష్మీదేవి పోటీ పడుతుండగా, వైయస్సార్సీపీ తరఫున పాలచెర్ల చిట్టెమ్మ, మార్నం జయమ్మ బరిలో నిలిచారు. హంపాపురము ఎంపీటీసీ స్థానానికి టీడీపీ తరఫున జానగొండ నాగేంద్రమ్మ, నంబూరి సరస్వతి, మంచాల సౌమ్యశ్రీ నామినేషన్లు వేయగా, వైయస్సార్సీపీ తరఫున జానగాని పరమేశ్వరమ్మ పోటీలో ఉన్నారు. యం.చెర్లోపల్లి ఎంపీటీసీకి టీడీపీ అభ్యర్థులుగా పామాల రామకృష్ణయ్య, బుడగ నారాయణస్వామి నిలవగా, వైయస్సార్సీపీ తరఫున మట్టా నాగవేణి, బుడగ సుభద్రమ్మ, మట్టా జయలక్ష్మి నామినేషన్లు సమర్పించారు. బండమీదపల్లి స్థానంలో టీడీపీ తరఫున దగ్గుపాటి శ్రీనివాసులు, దగ్గుపాటి సరస్వతి, వైయస్సార్సీపీ తరఫున యర్రగుంట అనిల్ కుమార్ రెడ్డి, మారక సుబ్బా రెడ్డిలతో పాటు మనుబోలు సుధాకర్ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు. మరూరు ఎంపీటీసీ స్థానానికి టీడీపీ నుంచి కొండపల్లి రాజేశ్వరి, కొండపల్లి చెన్నమ్మ, వైయస్సార్సీపీ నుంచి పూజారి ప్రతిమ, కడితి అనిత రంగంలో ఉన్నారు. పాలచర్ల ఎంపీటీసీకి టీడీపీ తరఫున రొద్దం లక్ష్మీదేవి, బి.శారద, వైయస్సార్సీపీ తరఫున హెచ్.లక్ష్మీదేవి, కల్లిబూట్ల శిల్ప పోటీపడుతున్నారు. ప్రసన్నాయపల్లి-1 స్థానానికి జె.మమత (టీడీపీ), రాజుల ఆలీషా (వైయస్సార్సీపీ) నామినేషన్లు ఆమోదం పొందగా, ప్రసన్నాయపల్లి-2 స్థానంలో బండి శివయ్య (టీడీపీ), వెన్నపూస వెంకటేశ్వర రెడ్డి (వైయస్సార్సీపీ) నామినేషన్లు ఖరారయ్యాయి. రాప్తాడు ఎంపీటీసీ స్థానానికి టీడీపీ తరఫున తలారి శివయ్య, పిట్ట రామాంజనేయులు  నామినేషన్లు వేయగా, వైయస్సార్సీపీ తరఫున చింతకాయల జయన్న బరిలో ఉన్నారు. యర్రగుంట ఎంపీటీసీ స్థానానికి టీడీపీ నుండి ఎ.ప్రతాప్ మౌళి, ఏ.అశ్విని, చాకల నారాయణ స్వామి, అలాగే వైయస్సార్సీపీ నుండి గాండ్లపర్తి రఘునాథ్ రెడ్డి, లోకేశ్వర్ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు అధికారులు ధృవీకరించారు. అదేవిధంగా నామినేషన్ల పరిశీలన అనంతరం బొమ్మేపర్తి ఎంపీటీసీ స్థానం నుంచి వైసీపీ తరపున నామినేషన్ వేసినయెద్దుల దీప, యెద్దుల మమత, రాప్తాడు ఎంపీటీసీ స్థానం నుంచి గంజి అభిలాష్ నామినేషన్ ను తిరస్కరించినట్లు తెలిపారు.

## అనాధ ఆశ్రమం లో అన్నదానం చేసిన ధర్మవరం ఫ్రెండ్స్

**అంకుశం న్యూస్ ధర్మవరం అక్టోబర్ 24** శనివారం ధర్మవరం ఫ్రెండ్స్ తమ మిత్రుడు రంజిత్ కుమార్ పుట్టినరోజు సందర్భంగా ధర్మవరం మండలం గొట్లూరు అనాధ ఆశ్రమం లో అన్నదానం చేసి తమ దాతృత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమం లో కె. రంజిత్ కుమార్ హేమంత్ కుమార్ తల్లి తండ్రులు పెద్ద పోతలయ్య గంగమ్మ, రఘు హార్దిక్ మల్లి కార్జున పి ప్రభాస్ వెంకట సాయి గాంధి నగర్ మిత్రులు కుటుంబ సభ్యులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు



# విజయవాడ మేయర్‌గా కూటమి అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణను గెలిపించండి

ఎన్నికల్లో గాజు గ్లాసు గుర్తుపై ఓట్లు వేయండి
ఆకుల శ్రీనివాస్ కుమార్



**అంకుశం న్యూస్ విజయవాడ అక్టోబర్ 24** విజయవాడ, అక్టోబర్ 24: విజయవాడ నగరపాలక సంస్థ ఎన్నికల్లో మేయర్ అభ్యర్థిగా బరిలో ఉన్న కూటమి అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణను అఖండ మెజారిటీతో గెలిపించాలని విజయవాడ నగర ప్రజానీకానికి సీనియర్ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. స్వర్గీయ వంగవీటి మోహన రంగా అనుంగు అనుచరుడైన ఆకుల శ్రీనివాస్ నగరపాలక సంస్థ ఎన్నికల నేపథ్యంలో నగర అభివృద్ధికి సంబంధించిన అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ప్రస్తుత మేయర్ అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణ గతంలో విజయవాడ శాసనసభ్యుడిగా పనిచేసిన అనుభవం కలిగి ఉన్నారని, నగర భౌగోళిక పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయనకు అవగాహన ఉందని ఆకుల శ్రీనివాస్ కుమార్ తెలిపారు. యువకుడు, విద్యావంతుడు అయిన రాధాకృష్ణ మేయర్‌గా బాధ్యతలు చేపడితే నగరంలో దీర్ఘకాలంగా కొనసాగుతున్న సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తారని ఆకుల శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా విజయవాడలో వర్షాకాలంలో తలెత్తుతున్న ముంపు సమస్యలు, మురుగునీటి పారుదల వ్యవస్థలోని ఇబ్బందులు, రహదారుల అభివృద్ధి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నగర ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమికి చెందిన అభ్యర్థి వంగవీటి రాధాకృష్ణ మేయర్ గా ఎన్నికైతే, నగర అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వ సహకారం, సమన్వయం చేసుకునే అవకాశం ఉంటుందని ఆకుల శ్రీనివాస్ కుమార్ పేర్కొన్నారు. విజయవాడను మరింత అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కూటమి తరపున జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వంగవీటి రాధాకృష్ణకు విజయవాడ నగర ప్రజలు ఎన్నికల్లో గాజు గ్లాస్ గుర్తుకు ఓటు వేసి రాధాకృష్ణ విజయానికి, తద్వారా నగర అభివృద్ధికి సహకరించాలని ఆకుల శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.

## ధర్మవరం లో కూటమి అభ్యర్థుల గెలుపు కోసం రాష్ట్ర చేనేత నాయకులు గిర్రాజు నాగేష్ ఇంటింటా ప్రచారం



**అంకుశం న్యూస్ ధర్మవరం అక్టోబర్ 24** ధర్మవరం మున్సిపల్ ఎన్నికలలో పోటీ చేసిన మున్సిపల్ టీడీపీ చైర్మన్ అభ్యర్థి పరిసే సుధాకర్ మరియూ బీజేపీ వార్డు కౌన్సిలర్లు కృష్ణాపురం రజియా బేగం, గుండా పద్మావతి,జింకా భారతి 18 వార్డు చేనేత టీడీపీ అభ్యర్థి పల్లెం కృష్ణ తదితరుల విజయం కోసం ధర్మవరం లోని రాష్ట్ర చేనేత బీజేపీ నాయకులు గిర్రాజు నాగేష్ ఇంటింటా ప్రచారం చేసారు. మంత్రి సత్య కుమార్ ఆదేశాల మేరకు తాను ఈ ప్రచారం చేసినట్లు గిర్రాజు నాగేష్ పేర్కొన్నారు. ధర్మవరం లో కూటమి విజయం తథ్యం అని ఆయన అన్నారు

## అనపర్తి నల్లకాలువ దగ్గర శ్రీదేవి నవరాత్రుల అన్నదాన కార్యక్రమం లో పాల్గొన్న మాజీఎమ్మెల్యే



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ అక్టోబర్:** శ్రీకనకదుర్గ అమ్మవారి నవరాత్రుల సందర్భంగా అనపర్తి నల్లకాలువ చిన్న వంతెన దగ్గర జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న అనపర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి శ్రీమతి ఆదిలక్ష్మి దంపతులు. ఈ సందర్భంగా గత 20 సంవత్సరాలుగా దేవి మరియు గణపతి నవరాత్రులకు పూజలు చేస్తున్న నాగదేవర సూరిబాబు శర్మని సత్కరించారు.
ఈ కార్యక్రమంలో సత్తి శివశంకర్ రెడ్డి, తేతలి అయ్యప్ప రెడ్డి, మల్లిడి వీర రాఘవరెడ్డి (వీరయ్య కాపు), కర్రి భాస్కర్ రెడ్డి, టీవీ రామారెడ్డి, మల్లిడి సత్తిరెడ్డి, మల్లిడి సునీల్ రెడ్డి, కర్రి వెంకటరెడ్డి (ఏడుకొండలు), యాసిడ్ రాము, తదితరులు పాల్గొన్నారు.

## వై సి పి విజయం కోసం మహిళా ప్రచారం



**అంకుశం న్యూస్ ధర్మవరం అక్టోబర్ 24** శనివారం, ధర్మవరం పట్టణంలో,25వవార్డు(సిద్దయ్యగుట్ట)మున్సిపాలిటీలో"కేతిరెడ్డి గారి ఆశీస్సులతో"వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ"కౌన్సిలర్ అభ్యర్థి–శ్రీమతి.కొడవండ్లపల్లి సుజాత,మున్సిపల్ ఛైర్మెన్ అభ్యర్థి–కాచర్లఆంజనేయులు గారి గుర్తు"ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి వేయించి,ఇద్దరినీ"అఖండ మెజారిటీతో" గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచారంలో వార్డు కౌన్సిలర్ అభ్యర్థి–శ్రీమతి.కొడవండ్లపల్లి సుజాత, మేకల ప్రసాద్,కొడవండ్లపల్లిశివ, దేవరకొండరమేష్, యం.చౌడప్ప, కత్తేపెద్దన్న, పోతలయ్య,నారాయణస్వామి, అశ్వర్థ, నారాయణ, నాగార్జున,దుర్గన్న,జగదీష్,ఇమ్రాన్,సురేష్,సింహంరాజేంద్ర"వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ"కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంక్షేమం, అభివృద్ధితో ప్రజల మనసులు గెలుచుకుంటున్నాం

**టీడీపీలో చేరిన 120 దళిత కుటుంబాలకు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు స్వాగతం.**





**అంకుశం న్యూస్ రాయదుర్గం రిపోర్టర్ అక్టోబర్ 24** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల మనసులను గెలుచుకుంటున్నాయని ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. రాయదుర్గం పట్టణంలోని 24వ వార్డు అంబేద్కర్ నగర్‌కు చెందిన సుమారు 120 దళిత కుటుంబాలు శనివారం తెలుగుదేశం పార్టీలో చేరాయి. యువ నాయకుడు రామాంజనేయులు ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సాదరంగా స్వాగతం పలికి, పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. సామాజిక పింఛన్లను రూ.3,000 నుంచి రూ.4,000కు పెంచడంతో పాటు, దివ్యాంగులు, వితంతువులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి పింఛన్ల రూపంలో ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. ఈ పింఛన్లు ఎన్నో పేద కుటుంబాలకు అండగా నిలుస్తున్నాయన్నారు. తల్లికి వందనం పథకం ద్వారా అర్హులైన ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15,000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతోపాటు, అర్హులైన పేద కుటుంబాలకు ఏడాదికి మూడు ఉచిత వంట గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో అన్ని వర్గాల పేద కుటుంబాలకు ఏదో ఒక రూపంలో సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. చంద్రబాబు నాయుడు నాయకత్వంలోనే ఇన్ని సంక్షేమ కార్యక్రమాలు సమర్థంగా అమలవుతున్నాయని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధికి కూడా ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గత రెండేళ్లలో రాయదుర్గం పట్టణంలో సుమారు రూ.260 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. రామాంజనేయులు ఆధ్వర్యంలో 120 దళిత కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరడం గర్వకారణమన్నారు. పార్టీలో చేరిన వారిలో వంద మందికి పైగా యువకులు ఉండటం ఈ ప్రాంతంలో టీడీపీకి మరింత బలం చేకూర్చుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై విశ్వాసంతోనే వారంతా పార్టీలో చేరారని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీని రాబోయే మూడు దశాబ్దాల పాటు యువ నాయకుడు నారా లోకేష్ మరింత బలోపేతం చేస్తారన్నారు. ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలంతో ముందుకు సాగుతుందనే నమ్మకంతో యువత టీడీపీ పట్ల ఆకర్షితులవుతోందని తెలిపారు. పార్టీలోకి కొత్త తరం యువత రావాలని, యువ రక్తంతో పార్టీ మరింత ఉత్సాహంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, చైర్మన్ అభ్యర్థి టశీకశాల హనుమంతు, అభ్యర్తి హరిజన నాగమ్మ, హరిజన నాగరాజు, పైతోట రామంజినేయులు,హరిజన ఆనంద్,మల్లికార్జున,బంగి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న మహిళామణులు



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ అక్టోబర్ 24:** అనపర్తి నియోజకవర్గ పరిధిలో మహేంద్రవాడకి ఒక ప్రత్యేక స్థానం ఉంది ఈ గ్రామంలో ఇద్దరు మహిళలు మధ్య గట్టిపోటీ నెలకుంది 03.11.2026నజరగబోయే ఎంపీటీసీ ఎలక్షన్ సందర్భంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున మహేంద్రవాడ 2 పరిధిలో ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న మేడపాటి స్వాతిలక్ష్మి.విద్యావేత్త, సౌమ్యురాలుగా పేరు ఉన్న స్వాతిలక్ష్మి మీడియాతో మాట్లాడుతూ..గెలుపుపై ధీమా వ్యక్తంచేస్తూ తన భర్త ఏపదవి లేనిటైములోనే ప్రజలకు తనవంతు సహాయ సహకారాలు చేస్తూ తనకంటూ మంచి మనిషిగా ముద్ర వేసుకున్న బీచ్చిగారుపద్దోడుగా అందరికీ సుపరిచితమైన మేడపాటి శ్రీనివాసరెడ్డి తనభర్త సేవలు తనను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేసిన మేడపాటి స్వాతి లక్ష్మి ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఈకార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అక్టోబరు 26న శ్రీ గోవిందరాజస్వామివారి పౌర్ణమి గరుడ సేవ

**అంకుశం న్యూస్ తిరుపతి అక్టోబర్ 24** పౌర్ణమి సందర్భంగా అక్టోబరు 26న తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి గరుడసేవ జరుగనుంది. ప్రతినెల పౌర్ణమి పర్వదినాన గరుడ సేవ నిర్వహిస్తున్న విషయం విదితమే. ఇందులో భాగంగా సాయంత్రం 6 నుండి రాత్రి 8 గంటల నడుమ శ్రీ గోవిందరాజస్వామివారు గరుడునిపై ఆలయ ప్రధాన వీధులలో విహరించి భక్తులకు దర్శనమిస్తారు.

## అక్టోబర్ 26న తిరుమలలో పౌర్ణమి గరుడ సేవ

**అంకుశం న్యూస్ తిరుమల అక్టోబర్ 24** తిరుమలలో అక్టోబర్ 26వ తేదిన పౌర్ణమి గరుడసేవ జరగనుంది. రాత్రి 7 నుండి 9 గంటల నడుమ సర్వాలంకార భూషితుడైన శ్రీ మలయప్పస్వామివారు సువర్ణకాంతులీనుతున్న గరుడునిపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు.

## కొత్తచెరువు జెడ్పీ కార్యాలయంలో జెడ్పీటిసి నామినేషన్ల పరిశీలనను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్,జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



**అంకుశం న్యూస్ పుట్టపర్తికొత్తచెరువు, అక్టోబర్ 24:** శ్రీ సత్యసాయి జిల్లా కొత్తచెరువు జెడ్పీ కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా శనివారం నిర్వహించిన జెడ్పీటిసి నామినేషన్ల పరిశీలన (ూషతీబ్‌అఅఎ) కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అకస్మాత్తుగా సందర్శించి ప్రత్యక్షంగా పరిశీలించారు. నామినేషన్ పత్రాల పరిశీలన ప్రక్రియలో రాష్ట్ర ఎన్నికల సంఘం (ూజుజ) జారీ చేసిన నియమ నిబంధనలను అక్షరాలా పాటించాలని రిటర్నింగ్ అధికారులను (=ూ /ూూ=ూ) కలెక్టర్ ఆదేశించారు. అభ్యర్థులు సమర్పించిన అఫిడవిట్లు, ఓటరు జాబితా వివరాలు, డిపాజిట్ రసీదులు, రిజర్వేషన్ ధృవీకరణ పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. ఏ చిన్న పొరపాటైనా నిబంధనల పరిధిలోనే పరిష్కరించాలని, ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నామినేషన్ల పరిశీలన సందర్భంగా ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా తగిన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని స్థానిక అధికారులకు మార్గదర్శకాలు జారీ చేశారు. పరిశీలన సమయానికి హాజరైన పోటీ అభ్యర్థులు మరియు వారి ఏజెంట్లతో కలెక్టర్ మాట్లాడి, ప్రక్రియపై సలహాలు, సూచనలు అందించారు.

## యల్లనూరులో ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే చర్యలపై కలెక్టర్ స్పందించాలి...

వైయస్సార్సీపి సమన్వయకర్త డా. శైలజానాథ్...



**అంకుశం న్యూస్, అనంతపురం,అక్టోబర్:24** శింగనమల నియోజకవర్గం, యల్లనూరు మండలం, తిమ్మంపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ అభ్యర్థినిని పోలీస్ స్టేషన్‌లోనే ఉంచి నామినేషన్ వేయకుండా అడ్డుకోవటం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని డాక్టర్ సాకే శైలజానాథ్ పేర్కొన్నారు. ఈరోజే నామినేషన్‌కు అడ్డంకులు సృష్టిస్తే, రేపు కౌంటింగ్ సమయంలో పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, సంబంధిత ఎంపీటీసీ స్థానానికి న్యాయం జరిగేలా ఎన్నికల నిబంధనల ప్రకారం తగిన నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి అభ్యర్థికి సమాన అవకాశం కల్పించడం అధికారుల బాధ్యత. ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా, పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలనీ డా.శైలజనాథ్ కోరారు.

## వర్షాన్ని సైతం ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ....



**అంకుశం న్యూస్, అనంతపురం,అక్టోబర్ : 24** అనంతపురం నగరపాలక సంస్థ ఎన్నికల ప్రచారంలో భాగంగా వర్షాన్ని సైతం అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ గారు ప్రచారాన్ని కొనసాగించారు. ప్రజల వద్దకు వెళ్లి కూటమి పార్టీల అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. నగరంలోని 25వ డివిజన్ మరువకొమ్మ కాలనీలో తెలుగుదేశం పార్టీ (టీడీపీ) అభ్యర్థి సోనియా తరఫున, 23వ డివిజన్ బోయ వీధిలో (జనసేన పార్టీ)అభ్యర్థి కాలేషా తరఫున ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్.ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా కూటమి (బీజేపీ) మేయర్ అభ్యర్థి అజేష్ బాబు విజయాన్ని కాంక్షిస్తూ ప్రజలను కలిసి ప్రచారం చేపట్టారు. వర్షం కురుస్తున్నప్పటికీ ప్రచారాన్ని ఆపకుండా కొనసాగిస్తూ కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ. కూటమి పార్టీల అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే అనంతపురం నగరం మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. నగర ప్రజల సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్యం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదలతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. నగర సమగ్ర అభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులకు ప్రజలు తమ అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.

# గ్రామీణ యువ క్రికెటర్లు సద్వినియోగం చేసుకోండి







**అనంత క్రీడా గ్రామంలో టాలెంట్ హంట్ రెండో దశ రెండవ రోజు ప్రారంభం**

**ధర్మవరం, కదిరి అండర్ 15 విభాగం నుంచి 71 మంది హాజరు**

**మచ్చా రామలింగారెడ్డి చైర్మన్ క్రికెట్ దెవలప్మెంట్ ఆర్డిటి**

**అంకుశం స్పోర్ట్స్ ప్రతినిధి అనంతపురం అక్టోబర్ 24**

అనంతపురం: గ్రామీణ క్రికెట్ ప్రతిభకు ఆర్డిటి టాలెంట్ హంట్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సాహాన్ని అందిస్తుందని రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ (=ఐు) ప్రోగ్రామ్ డైరెక్టర్ మంచో ఫెర్రర్ అనంతపురం జిల్లాలోని యువతకు మంచి అవకాశాలు కల్పిస్తున్నారని ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు మచ్చా రామలింగారెడ్డి చైర్మన్ ఆర్డిటి క్రికెట్ దెవలప్మెంట్ కమిటీ అన్నారు ఆర్డిటి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టాలెంట్ హంట్ రెండో దశ నేడు ఆర్డిటి క్రీడా మైదానంలో రెండోవ రోజు సెలెక్షన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్డిటి క్రికెట్ దెవలప్మెంట్ కమిటీ చైర్మన్ మచ్చా రామలింగారెడ్డి పాల్గొన్నారు.. ఈ సందర్భంగా మచ్చా రామలింగారెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రికెట్ ప్రతిభను వెలికితీసే లక్ష్యంతో ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టాలెంట్ హంట్ రెండో దశ సెలెక్షన్స్ రెండో రోజు శనివారం ఉత్సాహంగా కొనసాగాయి. ఆర్డీటీ క్రికెట్ గ్రౌండ్‌లో అక్టోబర్ 24, 2026న నిర్వహించిన ఎంపికలకు ధర్మవరం నియోజకవర్గం, కదిరి ప్రాంతాల నుంచి మొత్తం 71 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ధర్మవరం, కదిరి ప్రాంతాల నుంచి వచ్చిన యువ క్రీడాకారులు సెలక్షన్స్‌లో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా క్రీడాకారుల బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ నైపుణ్యాలను సెలెక్టర్లు క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తదుపరి దశ సెలక్షన్స్ కు ఎంపిక చేయనున్నట్లు మచ్చా రామలింగారెడ్డి తెలిపారు. గ్రామీణ ప్రాంత యువ క్రీడాకారులకు మంచి అవకాశాలు కల్పించేందుకు ఆర్డీటీ చేపట్టిన ఈ టాలెంట్ హంట్‌కు ధర్మవరం, కదిరి ప్రాంతాల నుంచి మంచి స్పందన లభించింది అని తెలిపారు




ఈ కార్యక్రమంలో సీనియర్ క్రికెట్ ప్లేయర్ వెంకటేష్, కోఆర్డినేటర్ ప్రవీణ్, సెలెక్టర్లు ప్రదీప్, విజయరాజు, యోగానంద, ప్రశాంత్ రెడ్డి కోచ్ లు రఫీ, ఇనయతుల్ల, రాజశేఖర్ పాల్గొన్నారు.



ఆర్డిటి రూరల్ క్రికెట్ టాలెంట్ హంట్ రెండోవ దశకు ఎంపిక అయిన అనంతపురం పట్టణ అండర్–15 క్రికెటర్లకు రేపు సెలక్షన్స్ అక్టోబర్ 25, ఆదివారం ఉదయం 9 గంటలకు ఆర్డీటీ క్రీడా మైదానంలో అనంతపురం పట్టణానికి చెందిన యువ క్రికెటర్లకు సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు ఆర్డీటీ టాలెంట్ హంట్ కమిటీ తెలిపింది.

# ఎన్నికల్లోనోడల్ అధికారులు బాధ్యతగా ఎన్నికల విధులను నిర్వర్తించాలి

**అంకుశం న్యూస్అనంతపురం, అక్టోబర్ 24 :** అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాంగ్రెస్ హాల్లో శనివారం స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నోడల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించగా, ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్, అనంతపురం జిల్లా స్థానిక సంస్థల జనరల్ అబ్జర్వర్ బి.స్మరణ్ రాజ్, ఐ.ఏ.ఎస్, జిల్లా ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ సుబ్బరాజు ఐఎఫ్ఎస్, జిల్లా ఎస్పీ పి.జగదీష్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థానిక సంస్థల జనరల్ అబ్జర్వర్ బి.స్మరణ్ రాజ్, మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నోడల్ అధికారులు బాధ్యతగా ఎన్నికల విధులను నిర్వర్తించాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల మెటీరియల్ పంపిణీ, రిసెప్షన్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ఓ.ఆనంద్ మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి క్షేత్రస్థాయిలో జరిగిన సమస్యలను ఎప్పటికప్పుడు ఫాలోఅప్ చేసుకుని నివేదికలను అందించాలని, నివేదికలను సరైన సమయంలో అందజేయాలని, ఇందుకోసం క్షేత్రస్థాయిలో సిబ్బందిని నోడల్ అధికారులు ఉపయోగించుకోవాలన్నారు. మ్యాన్ పవర్ మేనేజ్మెంట్ కు సంబంధించి ఒకటవ, రెండవ ర్యాండమైజేషన్ పూర్తికాగా, 30వ తేదీన మూడవ ర్యాండమైజేషన్ నిర్వహించాలన్నారు. జడ్పిటిసి / ఎంపిటిసి ఎన్నికల కోసం ఈరోజు వెంటనే ఒకటవ ర్యాండమైజేషన్ పూర్తిచేసి మండల స్థాయిలో సిబ్బంది ఎన్నికల సిబ్బందికి శిక్షణ నిర్వహించాలని ఆదేశించారు. మున్సిపాలిటీకి సంబంధించి రేపటికి ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల జాబితా ఫైనల్ చేయాలని, అనంతరం బ్యాలెట్ పేపర్ తయారు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, పోస్టల్ బ్యాలెట్ ప్రింటింగ్ కోసం ప్రింటింగ్ ప్రెస్ లను రెండు, మూడు గుర్తించి ఇబ్బంది లేకుండా ప్రింటింగ్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ కి సంబంధించి ఏ ఉద్యోగికి ఏ మున్సిపాలిటీలో ఓటు ఉందో ఆ మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్ పోలింగ్ బూత్ లో ఓటు వేసేలా చూడాలన్నారు. అవసరమైన బ్యాలెట్ బాక్స్ లను ఎలాంటి పొరపాట్లు జరగకుండా మున్సిపాలిటీ మరియు జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల పోలింగ్ కోసం సిద్ధం చేసుకోవాలన్నారు. పోలింగ్ అధికారులకు సమన్వయం చేసుకొని ట్రైనింగ్ నిర్వహించాలన్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కు సంబంధించి ఎఫ్ఎస్టి, విఎస్టి, ఎఫ్ఎస్టి రిపోర్టులను ప్రతిరోజు పంపించాలన్నారు. ఎన్నికల కమిషన్ (ఎస్ఈసి) నుంచి వచ్చిన కేసుల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎన్నికలలో రోజువారి యాక్టివిటీలను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. వెబ్ క్యాస్టింగ్ కు సంబంధించి క్రిటికల్ పోలీస్ స్టేషన్లలో వెబ్ క్యాస్టింగ్ నిర్వహించాలని, హైపర్ సెన్సిటివ్, సెన్సిటివ్ పోలింగ్ స్టేషన్లకు సంబంధించి ఏఎస్పితో సమన్వయం చేసుకుని వెబ్ క్యాస్టింగ్ చేసేలా దృష్టి పెట్టాలన్నారు. మీడియా ధృవీకరణ మరియు పర్యవేక్షణ కమిటీ (ఎంసిఎంసి)లో ఈసీఐ నిబంధనల ప్రకారం రిజిస్టర్ మైంటైన్ చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఫ్యాన్, లైట్, ఎలక్ట్రిసిటీ సరఫరా తదితర మరమ్మత్తులను వెంటనే పూర్తి చేయాలన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన వీల్ చైర్స్ అందుబాటులో ఉంచాలన్నారు. నోడల్ అధికారులు జాగ్రత్తగా పని చేయాలని సూచించారు.



– ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ లా అండ్ ఆర్డర్ కు సంబంధించి కొన్ని చెదురు మదురు ఘటనలు మినహా అన్ని చోట్ల ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరుగుతున్నాయన్నారు. పోలీస్ శాఖకు సహకారం అందించేందుకు ఇతర శాఖల నుంచి అవసరమైన సిబ్బందిని నియమించేలా చూడాలన్నారు.

– ఈ సందర్భంగా జిల్లా ఎక్స్పెండిచర్ అబ్జర్వర్ సుబ్బరాజు మాట్లాడుతూ ఎక్స్పెం డిచర్ కు సంబంధించి ఎప్పటికప్పుడు నివేదికలను అందించాలన్నారు. ఎక్స్పెండిచర్ రిజిస్టర్లను మైంటైన్ చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ.మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, రామ్మోహన్, పద్మావతి, మల్లికార్జునరెడ్డి, రమేష్ రెడ్డి, వెంకట నారాయణ, నోడల్ అధికారులు నాగరాజు నాయుడు, శైలజ, సుబ్బరాయుడు, రామసుబ్బారెడ్డి, డా.వెంకటేశ్వర్లు, ఓబులమ్మ, ఎన్ఐసి డిఐఓ భారతి, తదితరులు పాల్గొన్నారు.

## స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన.. పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు

పరిశీలించి భద్రతా చర్యలను సమీక్షించిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఎస్పీ పి.జగదీష్



**అంకుశం న్యూస్ అనంతపురం అక్టోబర్ 24** అనంతపురం?జిల్లాలో ఎన్నికల ప్రక్రియ లేదా కీలకమైన నిర్వహణకు సంబంధించి పకడ్బందీ చర్యలు వేగవంతమయ్యాయి. ఇందులో భాగంగా స్థానిక ఎస్ఎస్బీఎన్ (ఞాదీచీ) మరియు జేఎన్టీయూ (జీచీఖ) కళాశాలల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఐఏఎస్ మరియు జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఐపీఎస్ శనివారం సంయుక్తంగా పరిశీలించారు. ?ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద చేపట్టిన భద్రతా ఏర్పాట్లను వారు అడుగడుగునా పరిశీలించారు. గదుల సీలింగ్ ప్రక్రియ, సీసీ కెమెరాల నిఘా వ్యవస్థ, అగ్నిమాపక భద్రతా చర్యలు మరియు రాత్రింబవళ్లు పహారా కాస్తున్న పోలీసుల బందోబస్తు తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. స్ట్రాంగ్ రూమ్‌ల పరిసరాల్లో అనధికార వ్యక్తుల ప్రవేశం లేకుండా నిరంతరం కట్టుదిట్టమైన నిఘా ఉంచాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

## ఎన్నికలు ముగిసేవరకు కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం రద్దు..

– : జిల్లా ప్రజలు గమనించాలి

– : జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్..



**అంకుశం న్యూస్అనంతపురం, అక్టోబర్ 24 :** అనంతపురం జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసేవరకు అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమం రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజలు గమనించాలన్నారు. అర్జీలు ఇచ్చేందుకు కలెక్టరేట్ కు ఎవరూ రాకూడదని తెలిపారు. క్షేత్రస్థాయిలో కూడా పిజిఆర్ఎస్ రద్దు చేయడం జరిగిందని తెలిపారు.

## రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ స్వగ్రామం కౌకుంట్లలో ఇద్దరు ఎంపీటీసీలు ఏకగ్రీవంగా ఎన్నిక

మంత్రి పయ్యావుల కేశవ్ ని కలిసిన ఇద్దరు ఎంపీటీసీలు..

ఎంపీటీసీలకి అభినందనలు తెలియజేసిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్



**అంకుశం న్యూస్ ఉరవకొండ అక్టోబర్ 24 :** స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ స్వగ్రామం అయిన పెద్ద కౌకుంట్ల, చిన్న కౌకుంట్ల గ్రామాల్లో ఎంపీటీసీలుగా పోటీ చేసిన ఇద్దరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏకగ్రీవంగా ఎన్నికైన ఇద్దరు ఎంపీటీసీలు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ని కలిశారు. ఈ సందర్భంగా ఇద్దరు ఎంపీటీసీలకు శుభాకాంక్షలు తెలియజేసి రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక,వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి ప్రభుత్వం తరపున పోటీ చేసిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికవడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రభంజనం విస్తోందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి తరఫున పోటీ చేసిన అభ్యర్థులు ఘన విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మంత్రి సతీమణి త్రివేణి

**కూటమి అభ్యర్థుల విజయం కోసం కృషి**



**అంకుశం న్యూస్ ధర్మవరం అక్టోబర్ 24** ధర్మవరం పట్టణంలో స్థానిక ఎన్నికల ప్రచారంలో భాగంగా రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్యాశాఖ మంత్రివర్యులు శ్రీ సత్యకుమార్ యాదవ్ గారి సతీమణి శ్రీమతి త్రివేణి గారు 5 మరియు 11వ వార్డులలో ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 5 మరియు 11వ వార్డుల బీజేపీ అభ్యర్థి శ్రీ సోమ్లా నాయక్ గారు, శ్రీ జూటూరు వెంకటేష్ గారు, కూటమి తరపున మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్రీ పరిసె సుధాకర్ గారిని అఖండ మెజారిటీతో గెలిపించాలని పట్టణ ప్రజలను కోరారు. ప్రచారంలో స్థానిక ప్రజలు తమ సమస్యలను ఆమె దృష్టికి తీసుకురాగా, వాటిని తప్పక పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ప్రచారం లో టీడీపీ నాయకులు కమతం కాటమయ్య, పట్టణ టీడీపీ అధ్యక్షులు మరియూ మున్సిపల్ టీడీపీ చైర్మన్ అభ్యర్థి పరిసే సుధాకర్,తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా మంత్రి సతీ మణి శ్రీ మతి త్రివేణి ని మర్యాద పూర్వకంగా టీడీపీ నాయకులు సత్కరించారు

## డి.హీరేహాళ్ జెడ్పీటీసీ అభ్యర్థిగా వీఎం రామాంజనేయులు



**( అంకుశం న్యూస్ -- రాయదుర్గం, అక్టోబర్ 24, 2026)**

రాయదుర్గం: డి. హీరేహాళ్ మండలం జెడ్పీటీసీ అభ్యర్థిగా వీఎం రామాంజనేయులు ఎన్నికల బరిలో నిలిచారు. అనంతపురం జిల్లా కోర్టులో క్రిమినల్ న్యాయవాదిగా పనిచేస్తున్న ఆయన ఎం.టెక్, ఎల్ఎల్.ఎం (క్రిమినల్ లా) విద్యార్హతలు కలిగి ఉన్నారు. కొన్నేళ్లుగా బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ)కి న్యాయ సలహాదారుగా సేవలందిస్తున్న రామాంజనేయులు, న్యాయ సహాయం కోసం తనను సంప్రదించే పేదలకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. మండలం లోని గ్రామాల్లో తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం వంటి మౌలిక సమస్యల పరిష్కారం, అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవడం స్థానిక అభివృద్ధిలో కీలక అంశాలుగా ఉన్నాయి. జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో వీఎం రామాంజనేయులుకు మద్దతు తెలిపి గెలిపించాలని ఆయన మద్దతుదారులు మండల ప్రజలను కోరుతున్నారు.

## జనసేన పార్టీలో చేరిన డాక్టర్ పల్లపు తిరుపతేంద్ర

ప్రజా సేవే లక్ష్యంగా జనసేన పార్టీలోకి అడుగుబి రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ



**అంకుశం న్యూస్,పుట్టపర్తి,అక్టోబర్:24:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో జనసేన పార్టీకి సంబంధించి మరో ఆసక్తికర పరి ణామం చోటుచేసుకుంది.వడ్డెర సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షులు డాక్టర్ పల్లపు తిరుపతేంద్ర జనసేన పార్టీలో చేరారు. ప్రజా సమస్యల పరిష్కారం,సామాజిక సేవే లక్ష్యంగా ఆయన జనసేన పార్టీలో చేరినట్లు తెలుస్తోంది.ఆయన చేరికతో స్థానిక రాజకీయాల్లో ఎలాంటి మార్పులు చోటు చేసుకుంటాయి? జనసేన పార్టీ బలోపేతానికి ఆయన ఎలాంటి పాత్ర పోషించనున్నారు అనే అంశాలపై ఆసక్తి నెలకొంది.డాక్టర్ పల్లపు తిరుపతేంద్ర జనసేన పార్టీ హిందూపురం పార్లమెంట్ ఇంచార్జ నవీన్ నిశ్చల్ పార్లమెంట్ కమిటీ మెంబర్ అమర్ కార్తికేయ సమక్షంలో టి సాయి చరణ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు.పార్టీలో చేరిన ఆయనను నవీన్ నిశ్చల్ పార్టీ కండువా వేసి సాధారంగా ఆహ్వానించారు.